నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, సోమవారం 2 డిసెంబర్ 2024 | SURYAPET

## నిడమనూరు మోడల్ స్కూల్ టీచర్ సస్పెన్షన్

- ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్

నిడమనూరు, డిసెంబర్ 1 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణల నేపథ్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు దొడ్డా ఆంజనేయులు(టీజీటీ)ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుడు తమ పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ విద్యార్థినులు ప్రిన్సిపాల్ బూరుగు నిర్మలకు మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విద్యార్థినుల తల్లిదండ్రులు శనివారం పాఠశాల ఎదుట ఆందోళన చేసి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను నిలదీసిన ఘటనపై వార్తా కథనాలు ప్రచురితమవడంతో ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించారు. విద్యార్థినుల సంక్షేమం, ఘటనలపై పర్యవేక్షణ చేయకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తగు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శించి వార్తా కథనాలు వెలువడే వరకు శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడం వంటి కారణాల నేపథ్యంలో ఎందుకు సస్పెండ్ చేయకూడదో ప్రిన్సిపాల్ వెంటనే రాత పూర్వక సంజాయిషీ ఇవ్వాలని ఆదేశిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



కోదాడ పెద్ద చెరువు కట్టపై రూ.8 కోట్లతో నిర్మించనున్న ట్యాంకు బండ్ నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకం

# గురుకులాల్లో వసతులు కరువు

### నామమాత్రంగానే భోజనం

### తాగునీరు, నల్లా సౌకర్యం లేక విద్యార్థుల ఇబ్బందులు

## నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లో బీఆర్‌ఎస్‌వీ గురుకులాల బాట

**బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులు ఆదివారం ఉమ్మడి జిల్లాలో గురుకులా బాట చేపట్టారు. ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించి సౌకర్యాలు, వంట గదులు, పరిశుభ్రత, ఆహార నాణ్యత తదితర వాటిని పరిశీలించారు. హాస్టళ్లలోని సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.**

### హాస్టళ్లలో పలు సమస్యలు వెలుగులోకి.. విద్యార్థులకు భరోసా

### పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక



సూర్యాపేటలోని గిరిజన బాలికల డిగ్రీ గురుకుల కాలేజీలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు శిగ వెంకటేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, నాయకులు

### హాస్టళ్ల సమస్యలపై రేవంత్ సర్కారు నిర్లక్ష్యం : బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు శిగ వెంకటేశ్‌గౌడ్

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 1 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల డిగ్రీ గురుకుల కాలేజీతోపాటు పలు సంక్షేమ హాస్టళ్లను బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు శిగ వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ గురుకులాల విద్యార్థులు కలుషిత ఆహారం, అసౌకర్యాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ గురుకులాలను స్థాపించి ఎంతో మందికి నాణ్యమైన విద్యతోపాటు భోజనం అందించారని తెలిపారు. కానీ రేవంత్ సర్కారు గురుకుల పాఠశాలలను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు సరైన పోషకాలు అందించడంలో విఫలమయ్యారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాస్టళ్లను సందర్శించినప్పుడు నాణ్యమైన భోజనం పెడుతున్నారని, మిగతా రోజుల్లో బాగా ఉండడం లేదని విద్యార్థులు చెబుతున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఇకనైనా మేలుకొని గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, రాష్ట్ర విద్యార్థి సంఘం నాయకులు రాపోలు నవీన్‌కుమార్, నెమ్మాది శ్రవణ్‌కుమార్, బానోతు సురేశ్‌నాయక్, గుండాల సందీప్, పల్లెపంగు నాగరాజు, రమావత్ అశోక్‌నాయక్, వడ్డెపల్లి సందీప్, వేల్పుకొండ రామకృష్ణ తదితరులు ఉన్నారు.



నల్లగొండలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు స్వామి యాదవ్, తదితరులు

### మెనూ ప్రకారం భోజనం ఏది? : బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కడారి స్వామి యాదవ్

నల్లగొండ సిటీ : గురుకులాల్లో విద్యార్థులకు కనీస వసతులు లేవని, తాగు నీరు, కడుక్కోవడానికి నల్లాలు లేవని బీఆర్‌ఎస్‌వీ వైస్‌ప్రెసిడెంట్ కడారి స్వామియాదవ్ అన్నారు. కాంగ్రెస్ హయాంలో గురుకులాలు, మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు వసతులు లేకుండా పోయాయని తెలిపారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నల్లగొండ పట్టణంలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు.

తొలుత కేజీబీవీలోకి అనుమతి లేదని సిబ్బంది నిరాకరించారు. తర్వాత లోనికి వెళ్లి పలు పదార్థాలను పరిశీలిస్తుండగా ఎందుకు వచ్చారని నిర్వాహకులు బెదిరింపు ధోరణికి దిగారు. అనంతరం కడారి స్వామియాదవ్ మాట్లాడుతూ వంట గదితో పాటు వాటరు సింకు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. అక్కడే బయట ఉన్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను హాస్టల్‌లో వసతులు గురించి అడుగగా తమ పిల్లలకు తామే ఇంటినుంచి ప్లేట్‌లు తెస్తున్నామని, చలి కాలం కనీసం వారికి దుప్పట్లు కూడా అందించడం లేదని చెప్పారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్ సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్, బొమ్మరబోయిన నాగార్జున, మిదున్‌ప్రసాద్, నలపరాజు పరమేశ్, రవి, లింగస్వామి, రాజు, వెంకన్న తదితరులు ఉన్నారు.



నల్లగొండలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో డ్రింకింగ్ వాటర్ ట్యాంకర్‌ను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

# విజయోత్సవ వేళ.. వెక్కిరిస్తున్న శిలాఫలాకాలు!

## కోదాడ నియోజకవర్గంలో ఎక్కడి పనులు అక్కడే..

- రూ. 800 కోట్లకుపైగా నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ముందుకు సాగని వంద పడకల దవాఖాన.. మినీట్యాంక్ బండ్.. ఎత్తిపోతల పథకాలు
- సంక్షేమ పథకాలలోనూ కోత..
- విమర్శలు ఎదుర్కొంటున్న మంత్రి, ఎమ్మెల్యే ఉత్తమ్.. పద్మావతి దంపతులు



కోదాడలో వంద పడకల దవాఖానకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

కోదాడ, డిసెంబర్ 1 : కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పేరుతో పలుచోట్ల శంకుస్థాపనలు చేసింది. నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. కానీ నిధులు విడుదల కాలేదు.. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దాంతో ఖాళీ శిలాఫలాలు వెక్కిరిస్తున్నట్లు దర్శనమిస్తున్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం విజయోత్సవాల పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నది. 11 నెలలుగా హామీలు అమలు చేయకుండా, అభివృద్ధి చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని ప్రజలు మండిపడుతున్నారు.

**కోదాడ నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.800 కోట్లకు పైగా నిధులను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి ప్రకటించారు. వాటికి సంబంధించిన పనులకు శంకుస్థాపనలు కూడా చేశారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఇప్పటికే మూడు విడుతలు వివిధ విభాగాల అధికారులతో మంత్రి, ఎమ్మెల్యే సమీక్షలు కూడా నిర్వహించారు. కానీ పనులు మాత్రం సంవత్సరం కావస్తున్నా జరుగడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ బీటీ రోడ్లకు మట్టిపోయడం తప్ప ఆశించిన స్థాయిలో పనులు కొనసాగడం లేదని ఉత్తమ్ దంపతులు విమర్శలు ఎదుర్కొంటున్నారు.

**నిరుపయోగంగా ఎత్తిపోతల పథకాలు**

ఆయకట్టు చివరి ప్రాంతంలో రైతులకు సాగునీరు అందించేందుకు గత మార్చిలో రూ.25 కోట్లతో చేపట్టిన రెడ్లకుంట ఎత్తిపోతల పనులకు ఇప్పటికి తట్టెడు మట్టి కూడా పోయలేదు. ఇప్పటికే నియోజకవర్గంలో శిథిలావస్థలో ఏడు ఎత్తిపోతల పథకాలు, నాలుగు పనిచేయని ఎత్తిపోతల పథకాలతో రైతులకు ఏమీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా రెడ్లకుంట ఎత్తిపోతల పథకానికి తక్షణమే నిధులు మంజూరు చేసి అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

**లబ్ధిదారులకు అందని ఇండ్లు**

గత ప్రభుత్వం రూ.40 కోట్లతో కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో 560 డబుల్ బెడ్రూం ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులను ఎంపిక చేసింది. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఇండ్లు వినియోగంలోకి రావడం లేదు. రూ.80 లక్షలతో వసతులు కల్పించి లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించాల్సి ఉంది.

**శిలాఫలకాలకే పరిమితమైన మరికొన్ని పనులు**

కోదాడ పెద్ద చెరువు కట్టను రూ.8 కోట్లతో మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తున్నామని ఎమ్మెల్యే పద్మావతి 9 నెలల క్రితం శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఆ చెరువు కట్టపై ప్రస్తుతం ఇరువైపులా ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నది. ఇక రూ.80 కోట్లతో నూతన రహదారులకు నిధులు మంజూరు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు నామా మాత్రంగానే జరుగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోదాడలోని రోడ్లు, భవనాల అతిథి గృహానికి రూ.4కోట్లు మంజూరు చేసినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అనే చందంగా ఉంది.

**సంక్షేమ పథకాలలోనూ అదే దుస్థితి**

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించకపోవడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయకపోవడం, రైతుబంధును బంద్ చేయడం, ఆసరా పింఛన్లు పెంచకపోవడం, ప్రభుత్వ దవాఖానల్లో ప్రసూతి అయిన మహిళలకు రూ.10 వేలతోపాటు కేసీఆర్ కిట్టును అందించకపోవడం వంటివాటిపై ప్రజలు విమర్శిస్తున్నారు.

**వంద రోజుల్లో నిర్మిస్తామన్న వంద పడకల దవాఖాన**

అధికారంలోకి రాగానే వంద రోజుల్లో కోదాడ ప్రభుత్వ దవాఖానను వంద పడకలకు పెంచుతామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోదాడ 30 పడకల దవాఖానను వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ విడుదల చేయటంతోపాటు రూ.29 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫిబ్రవరిలో మంత్రులు రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వంద పడకల దవాఖాన నిర్మాణానికి శిలాఫలకం వేశారు. అది వేసి సంవత్సరం కావస్తున్నా ఇప్పటి వరకు పనులు షురూ కాలేదు. వంద పడకల దవాఖాన దేవుడెరుగు.. 16 మంది వైద్యులు విధులు నిర్వహించాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. కనీసం ప్రసూతి వైద్యురాలు కూడా లేకపోవడంతో నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించాల్సి వస్తున్నది.

**ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి**



అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి. కోదాడ నియోజకవర్గంలో చేపట్టిన పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి వెంటనే పూర్తి చేయాలి. ప్రభుత్వ దవాఖానలో వైద్యులు, సౌకర్యాలను పెంచి రోగులు, గర్భిణులకు ఇబ్బంది లేకుండా చూడాలి. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించి లబ్ధిదారులకు అప్పగించాలి.

-భాగ్యమ్మ, మహిళా నాయకురాలు, కోదాడ

## కుష్టు నియంత్రణకు ఇంటింటి సర్వే

- నేటి నుంచి 14 రోజుల పాటు కార్యక్రమం
- ఉదయం 7 నుంచి 10 గంటల వరకు
- 1,464 టీమ్‌లు, 293 మంది సూపర్‌వైజర్లు

నీలగిరి, డిసెంబర్1 : కుష్టు వ్యాధిని పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. గత పది సంవత్సరాల క్రితం కుష్టు వ్యాధిని సమూలంగా తరమిన వైద్య సిబ్బంది ఇప్పుడు జిల్లాలో అక్కడక్కడ కుష్టు వ్యాధి కేసులు నమోదు కావడంతోపాటు దేశ వ్యాప్తంగా ప్రివిలెన్స్ రేటు 2.3 శాతం ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. దీంతో సమూలంగా నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే క్షేత్ర స్థాయి సిబ్బంది వర్క్‌షాపులు పెట్టి శిక్షణ ఇచ్చారు.

**జిల్లాలో ప్రతినెల ఐదు నుంచి ఆరు లెప్రసీ కేసులు నమోదు**

జిల్లాలో ఫ్లోరిన్ కారణంగా కాళ్లు, చేతులు వంకర్లు పోతున్నాయని భావించినప్పటికీ వైద్య పరీక్షల్లో మాత్రం కుష్టు వ్యాధి లక్షణాలు కనడబడుతుడడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. గత సంవత్సర కాలంగా ప్రతి నెల జిల్లాలో ఐదు నుంచి ఆరు కేసులు నమోదయ్యాయి. ప్రారంభం దశలో గుర్తించి చికిత్స పొందిన వారిలో పూర్తిగా నయమవుతున్నది. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలో 92 మంది కుష్టు వ్యాధి సోకి చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధి నివారణకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు ఆందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్ర అసుపత్రిలో 20 పడకల ఇన్‌పేషెంట్ వైద్య సౌకర్యం కూడా ఉంది.

**ఈ నెల 15 వరకు ఇంటింటి సర్వే..**

కుష్టు వ్యాధిని గుర్తించి నియంత్రించేందుకు నేటి నుంచి ఈ 15వ తేది వరకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఇందుకోసం 1464 టీమ్‌లు, ప్రతి 5టీమ్‌లకు ఒక సూపర్‌వైజర్ చొప్పున 293 మంది సూపర్‌వైజర్లను ఏర్పాటు చేశారు. మలేరియా అధికారి నేతృత్వంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మేల్ ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తారు. ప్రతిరోజు గ్రామీణ ప్రాంతాల్లో 20, పట్టణ ప్రాంతాల్లో 25 ఇండ్ల చొప్పున ఉదయం 7 నుంచి పది గంటల వరకు సర్వే చేయనున్నారు. సగటున ప్రతి రోజూ 80 మందికి తగ్గకుండా పరీక్షలు చేస్తారు.

**ప్రతి ఇంటిలో చర్మవ్యాధులను గుర్తిస్తారు**



ఇంటింటికీ వచ్చే వైద్య సిబ్బందికి శరీరంపై మచ్చలు ఉంటే చెప్పాలి. దానికి అనుగుణంగా వారు పరీక్షలు చేస్తారు. చర్మ సంబంధ వ్యాధులు, కుష్టు వంటిపై నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదకరం.

- డాక్టర్ అరుంధతి, నల్లగొండ జిల్లా మెడికల్ అధికారి



## చెర్వుగట్టులో భక్తుల సందడి

భక్తులతో కిటకిటలాడుతున్న చెర్వుగట్టు ప్రాంగణం

నార్కట్‌పల్లి, డిసెంబర్ 1 : మండల పరిధిలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తిక మాసంలో ఆదివారం చివరి అమావాస్య కావడంతో దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. భక్తులు కొండపైన రాత్రి నిద్ర చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఓ నవీన్ కుమార్ మౌలిక వసతులు కల్పించారు.

## నాలుగో విడుత రుణమాఫీకి ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా రూ.236.90 కోట్లు మాఫీ చేసేందుకు సిద్ధం

నల్లగొండ, డిసెంబర్ 1 : రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం నాలుగో విడుత రుణమాఫీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే మూడు విడుతలుగా రుణమాఫీ చేసిన సర్కార్ ఆదివారం నాలుగో విడుతకు సంబంధించిన జాబితాను విడుదల చేసింది. మొదటి విడుతగా జిల్లా వ్యాప్తంగా 99,839 మంది రైతులకు రూ.579.14 కోట్లు, రెండో విడుతగా 54,551 మంది రైతులకు రూ.632.92 కోట్లు మాఫీ చేసింది. ఆ తర్వాత మూడో విడుత 33,084 మంది రైతులకు రూ.55.92 కోట్లు రుణమాఫీ చేసి నిలిపివేసింది. మిగిలిన వాళ్లకు పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదని రైతులు ఆందోళన చేసిన నేపథ్యంలో మరో విడుతగా రైతుల పేర్లను విడుదల చేసింది. నాలుగో విడుతలో 21,432 మంది రైతులకు రూ.236.90 కోట్లు మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. నాలుగో విడుతతో రైతులందరికీ రుణమాఫీ అవుతుందా లేదా అనే దానిపై త్వరలోనే స్పష్టత రానుంది. దీనికి సంబంధించి జాబితాను జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకు సిబ్బంది కూడా అందజేశారు.

## పని చేయించుకున్రు.. పైసలు ఎగ్గొట్టిన్రు


- కూలీల కడుపు కొట్టిన అధికారులు
- డబ్బులు రాలేదని కుంటి సాకులు

నకిరేకల్, డిసెంబర్ 1 : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో హడావిడిగా కూలీలతో పనిచేయించుకున్రు.. పైసలు ఎగ్గొట్టిన్రు..ఆయా గ్రామ పంచాయతీల్లో డబ్బులు జమ అయినా ఇవ్వకుండా అధికారులు కూలీల కడుపు కొడుతున్న సంఘటనలు లేకపోలేదు. పైగా డబ్బులు రాలేదని అధికారులే కుంటి సాకులు చెబుతుండడం గమనార్హం. నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం ఆగస్టు 5నుంచి 9వ తేదీ వరకు 14 మంది కూలీలతో పిచ్చి చెట్లు తొలగింపు, కంప చెట్లు కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. పనిచేసి దాదాపు మూడు నెలలు కావస్తున్నా తమకు డబ్బులు ఇవ్వడం లేదని గ్రామ కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టం తమకు రావాలని, కూలీ డబ్బులు ఇవ్వాలని అధికారులను అడిగితే ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ పొంతలేని సమాధానాలు చెబుతున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా 'స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో రోజువారీ కూలీలను పెట్టి పనిచేయించాం. కొన్ని గ్రామపంచాయతీల్లో కూలీలకు డబ్బులు ఇచ్చాం. కొంతమంది కూలీలకు డబ్బులు ఇవ్వాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే కూలీలకు అందజేస్తాం' అని బదులిచ్చారు.



నకిరేకల్ మండలంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో కార్యక్రమంలో భాగంగా పిచ్చిచెట్లు తొలగిస్తున్న కూలీలు(ఫైల్)

**మా కష్టం మాకు ఇప్పించండి సారూ**



గోరెంకలపల్లిలో బడిల, గుడి దగ్గర, గ్రామ పంచాయతీ ఆఫీసు కాడ, ఊళ్ల మొత్తం చెట్లన్నీ తొలగించినం. 14 మంది కూలోల్లం ఐదు రోజులు పని చేసినం. మా డబ్బులు మాకియ్యాలని ఎంపీడీఓను అడిగినం. కార్యదర్శిని అడిగినం. ఎవరూ పట్టించుకుంటలేరు. పని చేపించుకుని అవతల పడ్డరు.

- వంగూరి ఏసయ్య, కూలీ

**వర్షంలో తడుసుకుంటూ పని చేసినం**



ఆగస్టులో వర్షంలో తడుసుకుంటూ పనిచేసినం. కంపచెట్లు కొడుతుంటే చేతులకు కాళ్లకు తగిలి రక్తాలు కారుతున్నా పట్టించుకోలే. సార్లు చెప్పిన్రని పనిచేసుకుంట పోయినం. అసొంటిది గిప్పుడు పైసలు అడిగితే ఒకాయన మీద ఒకానయ చెప్పుకుంటున్రు. మా పైసలు ఇయ్యకపోతే కలెక్టర్ కాడికిపోతం.

- శెట్టిపల్లి శ్యాంసన్, కూలీ



నిడమనూరులో కోర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు, పక్కన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

## కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన

నిడమనూరు, డిసెంబర్ 1 : మండల కేంద్రంలో రూ. 5 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణ పనులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు పరిశీలించారు. నిడమనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి ఆదివారం భవనం, జడ్జి క్వార్టర్ నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిపై సమీక్షించారు. భవన నిర్మాణ పనుల పూర్తికి సంబంధించి వివరాలను కాంట్రాక్టర్ జలంధర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులను జనవరి 15లోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. పనుల పూర్తికి బార్ అసోసియేషన్ చొరవ తీసుకోవాలన్నారు. జడ్జి వెంట ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి సుమబాల, న్యాయవాదులు ముప్వా అరుణ్ కుమార్, బొల్లం శ్రీనివాస్, పుల్లారెడ్డి, వలసాని నాగరాజు, మాయకోటి వినోద్, పొదిల శ్రీనివాస్, మేఘారెడ్డి తదితరులున్నారు.